[redacted]

AOUA105B150

15.8.55

మహాకవి

శ్రీ గురుజాడ అప్పారావుగారి

కన్యాశుల్కము

శ్లో॥ మాత్సర్య ముత్సార్య విచార్యభావం ।
ఆర్యాస్సమర్యాద మిదంవదంతు ॥

V.R. NARLA MEMORIAL LIBRARY ★
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
12233

మోచర్ల సీతారామయ్య,
బరంపురం (గంజాంజిల్లా).

V.R. NARLA MEMORIAL LIBRARY *
V.R NARLA
D.P.R.I.
Acc. No.
1[illegible]

A00-A105B150

తొలిపలుకు

ఈ చిన్న విమర్శనమును నేను వ్రాయబూనుకొనుటకు, మహాకవి శ్రీ గురుజాడ అప్పారావుగారి యందున్న అపరిమిత భక్తి, "కన్యాశుల్కము" నాటకమందున్న ప్రేమయే కారణములు. ఈ మధ్య ఆంధ్రపత్రికలోనూ, భారతిలోనూ "కన్యాశుల్కము" విషయమై ప్రచురింపబడిన వ్యాసములు చాలావరకు నన్ను ఈ ప్రయత్నమునకు పురిగొల్పినవనుటలో సందేహము లేదు.

ఇది చిన్న పుస్తకం రూపంగా అచ్చువేయించ పూనుకొనుటకు కారణములు :

(1) నాకు తెలుగు సారస్వత ప్రపంచములో యే స్థానమూ లేకుండుట ;

(2) వ్రాసినది తిరిగీ జాగ్రత్తగా నకలు వ్రాసి యే పత్రికకైనా పంపి, వారు అచ్చువేసుకుంటారో లేదో అని ఎదురుచూచుటకు ఓపిక లేకుండుట ;

(3) ఈనాడు రాష్ట్రేతరమైన బరంపురం నుండి వ్రాసినవేవీ విపులంగా తెలుగు పత్రికలలో ప్రచురింపబడకుండుట.

నేను వ్రాసినదానిలో శ్రీ కేతవరపు వెంకటరామకోటిశాస్త్రిగారి విమర్శనమును చాలాసార్లు ఖండించవలసి వచ్చింది. అది నేను ఏవిధమైన ద్వేషముతోనూ వ్రాయలేదు. నేను వ్రాసినదానిలోకూడా కన్యాశుల్కము నాటకమునందు నాకున్న అభిమానము, అందులో యేమైనా

దోషాలుంటే కనబడకుండా చేసిందేమో చెప్పలేను. ఒకటిమాత్రం చెప్పగలను: దోషాలను వెతుకుదామని ప్రయత్నించాను కాని చెప్పతగ్గదోషాలేమీ కనబడలేదు.

కొండుభొట్లును మధురవాణి ముద్దుపెట్టుకొనుటలో పాత్రౌచిత్యమున కేమీ లోపములేదు. ఈ విషయమై విపులంగా వ్రాసియున్నాను. కాని, పంతులిచ్చిన బేడ, హెడ్డు ఇచ్చిన పావలా, వెండి తోడిపొడికాయ కొండుభొట్లు ఇచ్చినా, మధురవాణి తీసుకోకుండా ఉంటే బాగుండునేమోననిపించింది. దీనిని కూడా సమర్థించవచ్చును కాని—అనవసరం.

ఏ విమర్శనైనా సహృదయంతోనూ, నిష్కల్మషంగానూ చేయుట అవసరం. భాషలోగాని, శైలిలోగాని, మనకున్న భేదబుద్ధి ఇతివృత్త, సన్నివేశ, పాత్రపోషణాది విషయములలోనికి తీసుకొని వచ్చుట సమంజసముకాదు.

విమర్శనాదృష్టి విషయమై సంస్కృత గ్రంథాలలో ఎలా ఉందో తెలుసుకోగోరి నేను ఒక పండితుని అడిగాను. వారు ప్రచ్ఛన్నంగా వుండగోరుటచే వారి పేరు ఇక్కడ వ్రాయలేదు. వారు చెప్పినవి కొన్నిమాత్రము సూచిస్తున్నాను.

"కవితా రస మాధుర్యం వ్యాఖ్యాతా, వేత్తినోకవిః" అన్నది పెద్దలసూక్తి.

విమర్శకునకుండవలసిన దృష్టిని ఈ విధముగా సూచించారు పెద్దలు:

"గుణదోషౌ బుధో గృహ్ణన్ ఇందుక్ష్వేళా వివేశ్వరః ।
శిరసా శ్లాఘతేపూర్వం పరం కంఠే నియచ్ఛతి" ॥

ఈశ్వరుడెలాగైతే గరళాన్ని కంఠమునందుంచుకొని, చంద్రుని శిరస్సుపై నుంచుకొన్నాడో, అట్లే విమర్శకుడు కూడా యేకావ్యములోనైనా గుణములను వ్యక్తపరుస్తూ సాధ్యమైనంతవరకు దోషములను మాటుపరచాలి. అట్లని దోషములను పొగడాలనికాదు. దోషాల్లాగు కనిపించే వాటిని సమర్థించాలి. నిష్కల్మష దృష్టితో పరిశీలించి నిజంగా దోషాలని నిరూపింపగలుస్తే వాటిని సూచించడం కూడా విధే.

కావ్య విమర్శకుడు దోషాన్వేషణ దృష్టితోనే విమర్శనకు పూనుకొనుట ధర్మంకాదు. అలా విమర్శనచేస్తే యే సూత్రానికో వ్యతిరేకంగా ప్రతీ కావ్యములోనూ దోషములుండవచ్చు. అట్టి దోషాన్వేషణే దృక్పథముగా గల విమర్శన కుంచితమైపోతుంది.

దశరూపకకర్త చెప్పిన నాటక లక్షణాల ప్రకారం ప్రాచీన కవుల నాటకాలన్నీ కూడా సరిపడవేమో. పండిత రాయల దోషప్రకరణము ననుసరించి విమర్శనకు పూనుకుంటే ఏ కావ్యమైనా నిలుస్తుందా అన్న సందేహము కలుగుతుంది.

"రసాత్మకం కావ్యం"
"సహృదయ హృదయ ఆహ్లాదజనకత్వం కావ్యం"
అని ప్రాచీన లక్షణకారులన్నారు.

"కన్యాశుల్కము"ను శ్రీ అప్పారావుగారి కాలంలోనే శ్లాఘించినవారూ, వారి తదనంతరంకూడా నేటివరకూ ఆనాటకాన్ని కొనియాడేవారూ, వేనవేలున్నారు. ఇంకా వేనవేలుంటారు. భవభూతి చెప్పినట్లు పుడతారు కూడాను !

పాత్రలగురించి వ్రాసినప్పుడు గ్రంథ విస్తరణకు వెరచి చాలా తక్కువగా వ్రాశాను. నాటక కాలపరిమాణము గురించికూడా ఆ కారణంవల్లనే వ్రాయలేదు.

"కన్యాశుల్కము"న్నూ శ్రీ గురుజాడ అప్పారావుగారి పేరున్నూ ఆంధ్ర వాఙ్మయంలో చిరస్మరణీయములుగా నుంటాయని నానమ్మకం.

నేను వ్రాసినదానిలో భాషాదోషా లుండవచ్చు. అచ్చువేసిన తరువాత చదువుతూఉంటే నాకే పునరుక్తి దోషాలున్నట్లనిపించింది. అవి మన్నించి భావమే ప్రాధాన్యముగా గ్రహించి సహృదయులు "కన్యాశుల్కము" నాటకములోనున్న సర్వతోముఖమైన విశిష్టత గమనిస్తే నా యీ ప్రయత్నము సఫలమైనదని సంతోషిస్తాను.

బరంపురం }
గంజాంజిల్లా }

మోచర్ల సీతారామయ్య.

ఇందులో నేను "కన్యాశుల్కము"ను "కన్యాశుల్కం" అనివ్రాశాను. ఏపదం వాడినా ఆ నాటకానికే ఉద్దేశింపబడినదని గమనింపప్రార్థన.

మహాకవి శ్రీ గురుజాడ అప్పారావు పంతులుగారి

కన్యాశుల్కం

"కన్యాశుల్కం" గురించి వాదప్రతివాదాలు చాలా జరుగుతూఉన్నాయి. ఇది అప్పారావుగారు వ్రాయలేదని, గోమఠంవారు వ్రాశారని కొంతమందీ ; అప్పారావుగారు ఇంగ్లీషులో వ్రాశారని గోమఠంవారు ఆంధ్రీకరించారని కొంతమందీ, 1897వ సం॥లో అచ్చుపడినప్రతే అప్పారావు గారు వ్రాశారనీ, 1909వ సం॥లో ప్రచురణయిన ప్రతి గోమఠం శ్రీనివాసాచార్యులుగారు, వేదం వెంకటాచలయ్యగారు వ్రాశారని, అథవా వ్రాయకపోయినా సరిదిద్దారని కొంతమంది వ్రాస్తూవచ్చారు. వీటికి జవాబులుకూడా శ్రీ సీతాపతిగారు ప్రకటించారు. శ్రీ అవసారల సూర్యారావుగారు, శ్రీ ఒంగోలు సుబ్రహ్మణ్యంగారికి శ్రీ అప్పారావుగారు వ్రాసిన లేఖలలో కొన్ని భాగాలు 7-4-55 ఆంధ్రపత్రికలో ప్రచురించారు. ఆ లేఖలనుబట్టి శ్రీ అప్పారావుగారే 1897వ సం॥లో ప్రచురించిన నాటకమును, 1909 సం॥లో ఆమాతృకనే అధికముగాపెంచి నేటి కన్యాశుల్క నాటకమును వ్రాసినట్లు స్పష్టమవుతుంది.

ఈవాదనలిట్లుండగా జూను నెల "భారతి"లో శ్రీ కేతవరపు వేంకటరామకోటిశాస్త్రిగారు "కన్యాశుల్క" విమ

ర్శన ప్రచురించారు. వారు, ఈనాటకంలో 1952-53 సంవత్సరములలో ఆంధ్ర విశ్వవిద్యాలయ రజితోత్సవ సందర్భములో అగ్నిహోత్రావధాన్లు పాత్రను నిర్వహించి, ఉపాధ్యక్షుని బహుమతిని కూడా పొందినట్లు తెలియజేశారు. వారు "కన్యాశుల్కం" "సార్వకాలికత" "సార్వజనీనత" అయిన ఇతివృత్తము కాదనిన్నీ, పాత్రపోషణాలు కుంచితముగా వున్నవనిన్నీ, ఒక్క బుచ్చమ్మపాత్ర విడిచిపెడితే (ఆమెఅయినా చెల్లెలికోసం త్యాగంచేసిందిగనుక) తక్కినపాత్రలలో ఏపోషణా లేదనీ వ్రాశారు. "క్రమోన్మీలనమైనపాత్ర" ఒక్క బుచ్చమ్మపాత్రయేనని వారి అభిప్రాయం. వారు ఇట్లుకూడా వ్రాశారు: "వారియందు మనకున్న విశేషాభిప్రాయమునుబట్టి 'మహాకవి', 'యుగకర్త', 'ఆంధ్ర సారస్వత సామ్రాట్' ఇత్యాది బిరుదములనీయవచ్చు. ఈ రూపకము ననుసరించి అవి సార్థకములు గావు. శ్రీ అప్పారావుగారు కవిత్వముకూడా వ్రాసినారు గదా దానివలన ఆ బిరుదములు సార్థకములగునేమోనని కొందరూహింపవచ్చును. మరొకసారి శ్రీఅప్పారావుగారి కవిత్వమునుగూర్చి వ్రాయుదును".

అంటే రెండువిధాలైన వాగ్వివాదాలు "ఆంధ్రపత్రిక" లోను "భారతి" లోను వెలువడుతున్నాయన్న మాట. ఒకటి అప్పారావుగారు వ్రాయలేదనీ, రెండవది వారు వ్రాసినా, మానినా, అందులో పటిమగాని, సాహిత్యంగాని, ఇతివృత్తంగాని, పాత్రపోషణగాని, ఏమీ లేవనీ !

నేను పండితుణ్ణిగాను; నాకు సంస్కృతజ్ఞానం శూన్యం; అసలు ఏవాఙ్మయంలోనుకూడా జ్ఞానంలేదని చెప్పవచ్చు. అయినా నేను చిన్నప్పట్నుంచీ "కన్యాశుల్కా"న్ని అత్యధికంగా ప్రేమించాను. దాంట్లో 'వెంకటేశం' పాత్ర, 'మధురవాణి' పాత్ర, 'గిరీశం' పాత్ర కూడా వేశాను. ఆ నాటకమంటే నాకు చాలా ఇష్టం. నేనిది వ్రాయుటకదే కారణం.

నేను 1916వ సంవత్సరములో పర్లాకిమిడిలో గిడుగు వారి ఇంటికివెళ్ళి చదువుకొనేవాణ్ణి, ఆరోజులలో శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారు, శ్రీ గురుజాడ అప్పారావుగారి "కన్యాశుల్కా"న్ని గురించి ఎక్కువగా చెప్పేవారు. తాను వ్యావహారికభాషకోసం కృషిమాత్రం చేస్తున్నాననీన్నీ, నిజంగా వ్యావహారికభాషను పోషించి ప్రజలకందిచ్చినవారు అప్పారావు పంతులుగారనీన్నీ అనేవారు. (ఈముక్కలు వారన్నముక్కలుగావు. భావము మాత్రమే వారిది). ఇదేభావం శ్రీ బుర్రా శేషగిరిరావుగారుకూడా నాతో చాలాసార్లు వెలిబుచ్చారు.

శ్రీ ఎనమండ్ర నారాయణమూర్తిగారు అప్పారావుగారికి స్నేహితులు. వారుకూడా కవులూ రచయితలు. వారు గ్రంథాలు రచించారు. చాలా చక్కని పద్యకావ్యములవి. అవి ప్రచురణలోనున్నవి. వారిపిల్లలతో నాకు చాలాస్నేహం ఉండడంచేత వారు అప్పారావుగారిగురించి ఇతరులతో చెప్పే విషయాలు వినడంచేత "కన్యాశుల్క"

నాటకరచన సంపూర్ణంగా, ప్రథమ రెండవ ప్రచురణలూ, వారివేనని చెప్పగలను.

శ్రీ గురాచర్ల వెంకటరమణదాసుగారు (వీణా వెంకటరమణయ్యగారు) అప్పారావు పంతులుగారి ఘనతను, ఆంధ్రవాఙ్మయంలో ఆయనకున్న విశిష్టతనూ, ఆయన వ్రాసిన కన్యాశుల్క నాటక చరిత్రనూ, ఆనాటకమంటే శ్రీ ఆనంద గజపతిగారి ఆనందమునూ చెబుతూ వచ్చేవారు. శ్రీ అప్పారావుగారు మామూలు సంభాషణలో కూడా హాస్యము కనపర్చేవారనీ, అందువల్ల ఆయన శ్రీ ఆనందజగపతివారికిన్నీ, శ్రీ రీవా సర్కారువారికిన్నీ ఆప్తులయినారనిన్నీ చెప్పేవారు. అయితే నేను పయిన పేర్కొనినవారు కీర్తిశేషులగుటచే వారు చెప్పిన మాటలకు నేనే ఆధారం.

"కన్యాశుల్కం" అప్పారావుగారు వ్రాశారా లేదా అన్నముక్క ఒక్కమాటతో తేలిపోతుంది. దానిలోని భాష విశాఖమాండలికభాష. అది మరొకరికి అలవడదు. అసలు ఆనాటకాన్ని విశాఖజిల్లాకు దక్షిణాన్న ఉన్నవాళ్లు వేస్తే వారి ఉచ్ఛారణపొందదేమో అనిపిస్తుంది. 1935-36 సంవత్సరంలో సుప్రసిద్ధ నటకులైన డాక్టరు గోవిందరాజుల సుబ్బారావుగారి అధ్యక్షతను జరిగిన ఆంధ్రనాటకకళాపరిషత్త్యుత్సవసందర్భమున నేను, "గిరీశంపాత్రను సరీగ్గా నిర్వహించాలంటే గౌరగాత్రం ఉన్నవారూ స్థూలకాయులు కాని వారూ, విశాఖ మాండలీక ఉచ్ఛారణ కలవడినవారూ

అవసరమని" చెప్పినట్లు జ్ఞాపకం. నాటకంలోని భాష విశాఖవారుతప్ప మరొకరు సరిగ్గా ఉచ్చరించలేరేమోనని అనుకున్న నాకు, చెన్నపురి వాస్తవ్యులైన గోమఠంవారో, వెంకటాచలయ్యగారో వ్రాశారనిగాని, సరిదిద్దారనిగాని అనడమే అసందర్భంగా కనిపిస్తుంది.

ఇంతకూ మొదటి ముద్రణం 1897వ సంవత్సరములో ప్రచురణ అయినప్పుడు శ్రీ అప్పారావుగారు దానిని ఒక హాస్యరసప్రహసనం క్రిందే ప్రచురించారు. అప్పటికి పదేళ్ళక్రితం నుంచీ శ్రీ ఆనందగజపతిగారు ఈ కన్యాశుల్క-దుర్మార్గానికి తొలగించడానికి ప్రయత్నించపూనుకున్నారు అప్పట్లో చాలా లెఖ్ఖలు ఆరాతీశారు. అందు కొన్ని మొదటి ప్రచురణ పీఠికలో శ్రీ అప్పారావుగారు సూచించారు. గ్రంథ బాహుళ్యానికి వెరచి అవి యిక్కడ నివేదించడంలేదు.

ఆనాడది శ్రీ ఆనందగజపతిగారికి అంకితమిస్తూ మహాకవిగారేమన్నారంటే: "పదేళ్ళక్రితం తమరు ఈ కన్యాశుల్క దురాచారాన్ని గురించి ఆలోచిస్తూ ఆ అనాథ బాలికల నుద్ధరించేటందుకు పూనుకుంటే, ఈ తమ భృత్యుడు, ప్రజలు ఈ దుర్మార్గాన్ని గుర్తించి ఆ దురాచార నిర్మూలానికి పూనుకుంటారనే ఆశతో ఒక చిన్న నాటిక వ్రాశాడు. దాని ప్రదర్శనం అంతమందీ ఆమోదించడం, దాని నకళ్లు కావాలని అడగడంవల్ల నేను ఇది అచ్చువేయించి తమకు అంకితమీయ సాహసిస్తున్నాను".

రెండవ ప్రచురణలో "The Weekly Review" "The Telugu Harp"; "The East Coast News"; "The Indian Journal of Education" "The Social Reformer"; "The Dhimani" "Balika"; "Chintamani" అన్న పత్రికలు కన్యాశుల్క ప్రథమ ప్రచురణను శ్లాఘించిన వాక్యాలుకూడా ప్రచురింపబడ్డాయి. వాటిలో శ్రీ గురుజాడ అప్పారావు గారినే శ్లాఘించారు. శ్రీ గోమఠంవారు సంస్కృతాంగ్ల విద్వాంసులు. వారు ఆంగ్లభాషలో హరిశ్చంద్ర నాటకాన్ని వ్రాశారు. అట్టి మహాపండితులు, విద్వాంసులు, ఆంగ్లభాషా రచయితలూ, శ్రీ ఆనందగజపతిగారిని ఎరిగి ఉన్నవారూ, ఈపైన పేర్కొనబడిన పేపర్లలో శ్రీ అప్పారావుగారిని పొగుడుతూ ఉంటే ఎలా ఊరుకున్నారో దురూహ్యం. శ్రీ అప్పారావు పంతులుగారు వారి ప్రథమ ముద్రణ మంకితమిచ్చింది— అభినవ ఆంధ్ర భోజుడు శ్రీ ఆనందగజపతివారికి! ఆ ప్రథమ ముద్రణ గ్రంథం వారు తప్ప మరెవ్వరైన వ్రాశారంటే, లేక, వారింగ్లీషులో వ్రాస్తే తెలిగించారంటే ఆనందగజపతి గార్కి కూడా కళంకం. అంతేకాక ఆభాష మరెవ్వరూ వ్రాయలేరు. గంజాం, విశాఖ జిల్లాలవారైనాకూడా శ్రీ అప్పారావు గారి శైలిని అనుకరించలేరు. వారి శైలి ఒక విశిష్టమైనది. అది మరొకరికి రాదు. రెండవ ప్రచురణ పీఠికలో వారు తమ నాటకాన్ని శ్రీ ఎస్. శ్రీనివాసయ్యంగారి

ప్రోత్సాహం పైని సంపూర్ణంగా మార్చివేశారనిన్నీ అందువల్ల అది చాలా పెరిగిపోవడమే కాకుండా మొదటి ప్రచురణకంటే నూతనరూపం పొందిందని వ్రాశారు. ఆ పీఠికలోనే ఒక్క కొక్కొండ వెంకటరత్నం పంతులు గారు తప్ప తక్కినవారంతా ఈనాటకాన్ని ఆమోదించారనిన్నీ, విశాఖపట్టణ కాలేజీ ప్రిన్సిపాలుగారైన శ్రీ పి. టి. శ్రీనివాసయ్యంగారు, శ్రీ వీరేశలింగంపంతులు గార్ల గురించిన్నీ "Mackenzie Collections" గురించిన్నీ వ్రాశారు. శ్రీ వేదం వెంకటరాయశాస్త్రిగారు వారి 'ప్రతాపరుద్రీయం'లో వాడిన పాత్రౌచిత్య భాష ఒక మార్గదర్శి అయిందనికూడా వ్రాశారు. ఇట్లు తన కల్పనాచాతుర్యానికీ, భాషా విశిష్టతకూ తోడ్పడినవారిని పేర్కొన్న శ్రీ గురజాడ అప్పారావు గారు గోమఠం వారివద్దగాని, శ్రీ వేదం వెంకటాచలయ్యగారి వద్దగాని యేమాత్రమైనా సహాయ్యం పొందివుంటే అది పేర్కొనక పోవుదురా? అచ్చువేసిన శ్రీ జి. రామస్వామి చెట్టిగారికి కృతజ్ఞతాభివందనా లర్పించారే, వీర్ల పేర్లు మర్చిపోతారా? ఒకవేళ మర్చిపోతే వీరు దుమ్ము రేగగొట్టరా? ఈనాడు 'మహాకవి' వారిని వారు సమర్థించుకోనేస్థితిలో లేనపుడు ఈ అసందర్భపు ప్రసంగం అనావశ్యకమని నాఊహ. శ్రీ అప్పారావుపంతులుగారు వ్రాసిన ప్రథమ, ద్వితీయ పీఠికలు, అంకితం, చదివినవారందరికీ "ఆంధ్రపత్రిక"లో వ్రాసిన "సా. వి."గారు వగైరావారి

వాదన ఎంత అప్రస్తుతమో తెలియగలదు.

మరొక్క విషయం: "సా.వి." గారు శ్రీ గిడుగు సీతాపతిగార్ని ఎత్తి పొడుస్తున్నపుడు గురుజాడవారు వారి పీఠికలోనే పదేళ్ళక్రితమే కన్యాశుల్కం వ్రాసినట్లు తెలియజేశారనీ అప్పటికి సీతాపతిగారు యాడాదిపిల్లవాడనీ, అందుచేత ఆయన చెప్పినవి అసత్యాలని వ్రాశారు.

1897వ సంవత్సరములో అచ్చుపడిన పుస్తకమునకు పీఠిక ఒకటి, అంకితమొకటీ ఉన్నాయి. నావద్ద ఆ ప్రతి లేదుగాని 1909వ సంవత్సరంలో అచ్చయిన ప్రతిలో ఈ రెండూకూడా ఉన్నాయి. పీఠికలో పదేళ్ళక్రితం శ్రీ విజయనగర మహారాజావారు బ్రాహ్మణులలో కన్యాశుల్క-వివాహ విషయమై విశాఖజిల్లాలో లెఖ్ఖలుతీయమని సెలవిచ్చినట్లు మాత్రం తెలుస్తూంది. అప్పారావుగారు అంకితంలోకూడా "పదేళ్ళక్రితం ఈ అసహాయ స్త్రీజాతిని రక్షించే ఉద్దేశం తమకు కలగగా యీభృత్యుడు సర్వసాధారణ జనానికి అర్థమయ్యే నాటకంద్వారా ప్రజాసామాన్యం ఈ అవినీతిని తెలుసుకుంటారనే దృక్పథంతో, ఒక చిన్ననాటకం వ్రాశాడు" అని వెలిబుచ్చారు. అంకితమునూ పీఠికనూ కలిపి చదువుతే శ్రీ ఆనందగజపతిగారు పదేళ్లకు పూర్వం ఈదురాచారాన్ని గుర్తించి దాని విషయమై చర్యతీసుకోడానికి ప్రయత్నించారనే ఉంది కాని, గురుజాడవారు 1897 సంవత్సరానికి 10 యేళ్ళపూర్వం ఇది వ్రాసినట్లుగా ఎక్కడుందో నాకు బోధపడుటలేదు.

ప్రథమ, ద్వితీయ ముద్రణల పీఠికలు వగైరాలను చదివిన సహృదయులు నిజానిజాలు గమనిస్తారని నమ్ముతాను.

ఈవిషయమై ఇటీవల నేను శ్రీ గోపినాథబెహరాగారితో మాట్లాడుట తటస్థించినది. శ్రీ బెహరాగారు గంజాం జిల్లా కలెక్టరుగానే కాకుండా జయపురం దివానుగానుండి రిటైరు అయ్యారు. వారు శ్రీ గిడుగు రామమూర్తిగారికి ప్రియశిష్యులు. విజయనగరం షరాఫ్‌ఖానావారి వీధిలో శ్రీ రామమూర్తి పంతులుగారు ఉన్నరోజులలో శ్రీ గోపినాథబెహరాగారు వారియింటికి వెళ్లడం శ్రీ అప్పారావు పంతులుగారి దర్శనభాగ్యం పొందడం జరిగింది. శ్రీ బెహరాగారు ఉత్కళులైనప్పటికీ సంస్కృతాంధ్ర భాషలను చక్కగా తెలిసినవారు. వారు చాలాకాలం ఆంధ్ర ప్రాంతాలలో పనిచేశారు. వారుకూడా, "కన్యాశుల్కం" విషయమై శ్రీరామమూర్తి పంతులుగారు శ్రీఅప్పారావుగారిని శ్లాఘించడమేగాక, వారు చెప్పిన మాటలను బట్టి "కన్యాశుల్కం" కృతికర్త శ్రీ అప్పారావుపంతులుగారే ననుటకు ఎంతమాత్రం సందేహము లేదని చెప్పేరు.

ఇకనైనా మహాకవి శ్రీ అప్పారావు పంతులుగారు తాము వ్రాయలేనిదానిని మరొకరిచే వ్రాయించుకొని తమపేర ప్రచురించి తమకు తగని గౌరవ మర్యాదలను పొంది, అట్టి పుస్తకాన్ని శ్రీ ఆనందగజపతివారి కంకితం ఇచ్చారని సూచించే ఇటీవల వెలువడిన అప్రస్తుత, అసందర్భ వివాదాలు ఆగిపోతాయని ఆశిస్తున్నాను.

ఇతివృత్తం

ఇక కన్యాశుల్కంలోని ఇతివృత్తము, పాత్రపోషణా, సార్వకాలికత, సార్వజనీనత, ఇత్యాది విషయాల గురించి ఆలోచిద్దాం. జూను భారతిలో శ్రీ కేతవరపు వెంకట రామకోటిశాస్త్రిగారు "కన్యాశుల్కం" విషయమై ప్రచు రించిన వ్యాసానికి నేనెంతయు కృతజ్ఞుడను. వారది ప్రచు రించకపోయిఉంటే ముప్పది సంవత్సరాలనుంచీ తెలుగులో యేమీవ్రాయని నాబోంట్లకు ఈ అవకాశం కలుగక పోయిఉండేది. చాలారోజులై కన్యాశుల్క నాటక విశిష్ట తను, పాత్రపోషణాచాతుర్యమును నా బుద్ధికి తోచినంత వరకు వ్రాయాలని కుతూహలం ఉన్నప్పటికీ, పాండిత్య లోపంచేత జంకాను.

కన్యాశుల్క నాటక విమర్శనలో ప్రథమ ప్రచురణ మనం మరచిపోవాలి. 1909వ సంవత్సరానికి తయారైన నాటకం రూపకం కావచ్చు; ఈ నాటకం ప్రదర్శనీయం కావచ్చు కాకపోవచ్చు; ఈనాటి రెండుఘంటల పరిమితిలో యేఘట్టాలు వెయ్యాలో యేవి వదలిపెట్టాలో అన్న సమ స్యలు తేల్చుకోవడం కష్టమనుటకు సందేహము లేదు; శ్రీ శాస్త్రిగారు వ్రాసినట్లు సారాయి దుకాణం వెనుక తోటవేయుటకు కష్టముగావచ్చు మనకున్న పరికరాలతో! కాని 'కన్యాశుల్క' నాటకం ఒక మహాకావ్యమనిన్నీ ఆ మహానాటకం మనదేశంలో యేనాటికైనా నిల్చిఉంటుం దని నా నమ్మకం—నిల్చిఉండాలని నా ఆశయం. ఇట్టి

నాటకమే మరి యే పాశ్చాత్యదేశంలోనైనా రచింపబడి ఉన్నట్లైతే శ్రీ అప్పారావుగారిని ఎంత మెచ్చుకొని ఎన్ని పదవులు ఇచ్చియుందురో ఆలోచనకుకూడా అతీతం.

'సార్వకాలికత', 'సార్వజనీనత' గురించి శ్రీ శాస్త్రి గారు వ్రాశారు. ఒక నిర్దుష్ట సాంఘిక నాటకం—'కన్యాశుల్కం'. Shakespeare వ్రాసిన నాటకాలలో కూడా చారిత్రాత్మకం తప్పిస్తే, తక్కినవి ఈ సిద్ధాంతాలను ఎంతవరకు తృప్తిపరుస్తాయో ఆలోచనీయాంశం. ధనంజయుని సిద్ధాంతాలు నాకు తెలియవు. కాని దేశాలు మారి పోతూఉన్నాయి; మనుష్యులు మారిపోతున్నారు; ప్రబంధయుగం పోయింది; మనుచరిత్ర, వసుచరిత్ర వగైరా ప్రబంధాల నియమాలను పాటించి యీనాడు యేకనైనా ఒక ప్రబంధం వ్రాయఘూనుకుంటే అది కొనేవారు లేక పోవడమే కాకుండా చదివేవారుకూడా ఉండరు. నాకు 'మనుచరిత్ర' ఇష్టప్రబంధం. పెద్దనగారి కవిత్వం వంటి కవిత్వం లేదని నామతం. నేను మనుచరిత్రను సూచించానంటే, ఆ మహాప్రబంధంకూడా శ్రీ శాస్త్రిగారి వాదనాన్ని తృప్తిపరచదేమో అని సూచించుటకే.

శ్రీ అప్పారావుగారు 'యుగకర్త' లనడానికి కారణం వారు ప్రప్రథమంగా ఒక సాంఘిక ఇతివృత్తాన్ని తీసుకొని శిష్టవ్యవహారిక భాషలో దానిని పెంపొందించుటయే! ఏ సాంఘిక ఇతివృత్తాన్ని సూచించే రచనలోగాని నాటి సాంఘిక విషయాలను సూచించక తప్పదు. "కన్యాశుల్కం"

లోని చిన్న చిన్న విషయాలుకూడా శ్రీ శాస్త్రిగారికి బోధపడీనట్లు కనపడదు. 'కిసిమిసి' సెలవలకు పూర్వం అర్ధసంవత్సర పరీక్షలే అవుతాయని సాంవత్సరిక పరీక్షలు కావని శ్రీ శాస్త్రిగారి ఊహ. దీన్నిబట్టి శ్రీశాస్త్రిగారు చాలా పిన్నవయస్కులనిపిస్తుంది. ఆ రోజులలో డిశంబరు నెలలోనే సాంవత్సరిక పరీక్షలు అయ్యేవి. చిన్న క్లాసుల పరీక్షా ఫలితాలు ముందే తెలిసేవి. అవి ఇంగ్లీషువారు మనకు పెట్టిన భిక్ష. ఆతరువాత మనదేశం ఉష్ణప్రదేశం కాబట్టి మనం దెబ్బలాడి ఆ పరీక్షలు ఫిబ్రవరి, మార్చి నెలలకుమార్పించి వేసవి శలవలు సంపాదించాం. ఈ సంగతి గుర్తుంటే శ్రీ శాస్త్రిగారు ఈ చిన్న విషయమై ఇంత వ్యాఖ్యానించకపోయేవారు.

నోబెల్ ప్రయిజు తీసుకున్న Pearl Buck ఆమె చిన్న తనంలో ఉన్న చైనాదేశ ప్రజలను తన నవలలలో ఎంతో అద్భుతంగా, వాస్తవికంగా చిత్రించింది. ఈనాడు చైనా చాలా మారిపోయింది. కాని Pearl Buck వ్రాసిన నవలలలోని ఇతివృత్తాలను మనం ఖండించగలమా !

అసలు "కన్యాశుల్కం"లో ఉన్న ఇతివృత్తం, పాత్రలూ యేదేశంలోనైనా యేనాటికైనా ఉంటాయనీ, ఆ మహా కవి చేతిలో తయారైన పాత్రలు ఈనాటికి కూడా మనం చూస్తున్నామని నామతం. శ్రీ శాస్త్రిగారి సిద్ధాంతా లను అనువర్తింపజేసి చూస్తే, శ్రీ అప్పారావుగారు, Shakespeare యిత్యాది నాటక రచయితలకంటే

కూడా అధికుడేమో ననిపిస్తుంది. మనం చూసే గిరీశం Private Tutor కాకపోవచ్చు, మనం చూసే లుబ్ధావధాన్లు రెండవ వివాహానికి ప్రయత్నించకపోవచ్చు, మనం చూసే మధురవాణి వేశ్య కాకపోవచ్చు—కాని ఆ వ్యక్తులుమాత్రం కనబడుతూఉన్నారు. "కన్యాశుల్కం" చదివితే అందులో యేనాటికైనా పనికివచ్చే నీతులు మనకు కనబడుతాయి. ఒక్క సంగతి ఆలోచించండి: బండీలో క్రిష్ణరాయపుర అగ్రహారానికి వెళుతూ గిరీశం కాంగ్రెసు గురించీ స్వతంత్రం గురించీ లెక్చరు కొడుతూఉంటే బండీవాడు ఒకటేప్రశ్న వేస్తాడు—మాపూరి హెడ్డుని ఎప్పుడు బదిలిచేస్తారని ! ఏడేళ్లైంది మనకు స్వరాజ్యం వచ్చి ! ఈనాటికైనా మనప్రజలు అది గుర్తించారా ? మనదేశం, మనరాజ్యం, మనదేశస్తులని మనం గౌరవించాలి అన్న ధ్యాస ఉందా ? మావూరి హెడ్డుని బదిలీ చేయించమనీ, మాజిల్లా తహసీలుదారుని బదిలీచేయమనీ తప్ప మన స్వాతంత్ర్యం యీనాటికీ మనం ఉపయోగించుకోవడం లేదుగదా, 19వ శతాబ్దంలో ప్రజలెట్లుండేవారు ? ఆ బండీవాని ఒక్క ప్రశ్నలో ఆనాటి వాతావరణమే కాకుండా ప్రజాబాహుళ్యం విద్యావంతులు కాకపోతే వారికుండే కుంచితాభిప్రాయాలను సూచించాడు మహాకవి. ఇది సార్వకాలికత సార్వజనీనత కాకపోతే మరేమో నాకు తెలియదు.

సన్నివేశాలు

ఇక సన్నివేశాలగురించి ఆలోచిద్దాం. పూటకూళ్లమ్మ మంచంక్రిందకు వంగి చీపురుకట్టతో కొట్టినది గిరీశాన్ని. కాని గిరీశం రామప్పంతులిని చమత్కారంచేసి ముందుకు జరపడంవల్ల పొరపాటున దెబ్బ రామప్పంతులుమీద పడింది. గిరీశం చురుకైనరాడే. "వెర్రప్పా! మంచంక్రిందికి రా వెర్రి వదలగొడతాను" అని పూటకూళ్లమ్మను మంచంక్రిందికి రానిచ్చి తను మరోవేపు తప్పించుకొని రామప్పంతులు నెత్తిమీద చరిచి పారిపోతాడు. రామప్పంతులు పిరికిపంద—పోలీసువాళ్లని కబురుపంపాల్సిందే గాని తనేమీచేయలేడు. (అసలు ఈఘట్టం సరిగ్గా అర్థం చేసుకుంటే హెడ్డును 'గులాం'లాగు మధురవాణి ఎందుకు త్రిప్పుకుందో బోధపడుతుంది). ఆపరిస్థితులలో, గుట్టుబైట పడకుండా విజయనగరం వదలిపెట్టాలని నిర్ణయం చేసుకున్న మధురవాణి రామప్పంతులు తలనిమిరి ముద్దు పెట్టుకుంటుంది. ఇందు అవినీతి యెక్కడుందో కాలపరిమితి యెంతని శ్రీశాస్త్రిగారు నిరూపిస్తున్నారో నాకవగాహన కావడంలేదు. పూటకూళ్లమ్మ యీముద్దులు చూడడానికి మంచంక్రింద కూర్చున్నదా అని వారిప్రశ్న! అప్పటికీ ఇలాంటి ఛాందస విమర్శన లుంటాయేమోనని భయపడి కాబోలు మహాకవి "ఫడేల్మంటే పస్తాయించిచూస్తున్నాను నీ మొగతనం యేడిసినట్లేఉంది" అని పూటకూళ్లమ్మచేత అనిపించాడు.

కరటకశాస్త్రి శిష్యుడి సంభాషణ అనవసరమని శ్రీశాస్త్రిగారివాదన. అసలు నాటకాన్నే అర్థం చేసుకో లేదు—శ్రీ శాస్త్రిగారు! ఆశిష్యుడు ఆడవేషం యెందుకు వేయాలి ? తనకూతుర్నిచ్చి వివాహం చేస్తానని ప్రమాణం చేయకపోతే కరటకశాస్త్రి తనశిష్యునిచే యీ నాటకం ఆడించగలడా ? ఈ సంగతులు గుర్తించిన యే సహృదయులైనా యీ సన్నివేశాలు అనవసరమనలేరు. అలాగే పేకాటసీనుకూడా. రామప్పంతులు పిరికిపంద. హెడ్డు, పోలిసెట్టి, సిద్ధాంతి వగైరా ఆపూరిలో పలుకుబడి ఉన్న వారు. వారినాకట్టుకోవడం యేవేశ్యకైనా అవసరమే. అలాంటివే తక్కిన సన్నివేశాలుకూడా. ఆరోజుల వాతావరణం మనం కొంచం గుర్తుంచుకోవడమో ఆనాటివాళ్లతో పరిసంగించడమో జరిగితే యీసన్నివేశాలు మనకు అర్థమౌతాయి. మనవాళ్లను మనం నిందించడమే దృక్పథమైతే నేనేమీ అనలేనుగాని, సారస్వత దృష్ట్యా చూస్తే "కన్యాశుల్కం" ఒక అద్భుతనాటకం అని ఒప్పుకోక తప్పదు.

'ఇతివృత్తం' 'సన్నివేశాలు' ఆలోచిస్తే కన్యాశుల్కం వంటి కావ్యం ఆధునికయుగంలేదని నానమ్మకం. గాంధర్వ వివాహమాడి దూర్వాసుని శాపంవలన శకుంతలనే మరచి పోయిన దుష్యంతుడు, ఒకచేతిరుమాలుకై Desdemona ని చంపిన Othello, సకారణమైన ద్వేషమా, అకారణమైన ద్వేషమా అని యీనాటికీ నిర్ధారణకాని Iago

పాత్ర సృష్టి వగైరా వేనాటకాలు, ప్రబంధాలైనాచూసి సరిగ్గా అర్థంచేసుకుంటే శ్రీశాస్త్రిగారు "కన్యాశుల్కం" విషయమై యింత కటువుగా వ్రాయకపోయియుందురు.

సన్నివేశాలగురించి వ్రాస్తూ, శ్రీ శాస్త్రిగారు అగ్నిహోత్రావధాని తనవారిని క్రిష్ణరాయపురం పంపకుండా ఉండడం, లుబ్ధావధాని యిల్లుచూపమని రామప్పంతులిని అడగడం, కేసులు వగైరా విషయాలు పేర్కొన్నారు. వెంకమ్మ వగైరాలు ఇంటికి వెళ్లిపోయుంటారని మనం ఊహించుకోవాలి. ఏగ్రంథకర్తా అన్నీ నిరూపించడు. అగ్నిహోత్రావధాని లుబ్ధావధానిమీద వేసిన కేసు దగా కేసు. గిరీశంమీదది పిల్లను లేవతీసుకోనిపోయినందుకు. కాని వీటన్నిటికంటే ముఖ్యమైన కేసు లుబ్ధావధాన్లుమీద బనాయించిన ఖూనీకేసు. దానికొరకే "ఆ గుంటూరుశాస్త్రులెవరుచెప్మా అని" సౌజన్యారావు ఆలోచిస్తాడు. అది ఖూనీ అని నిరూపణకాలేదు గనుకనే లుబ్ధావధాన్లు జైలులోలేడు. హెడ్డుకి అన్నిసంగతులూ తెలుసు. లుబ్ధావధానివద్ద పైసాలాగడమే అతని ఆశయం. మధురవాణి విశాఖపట్నం ఎందుకు చేరుకుంది ? విజయనగరం ఎందుకు వెళ్లలేదు? ఆమెనివాసం రామప్పంతులి కెలా తెలుసు అన్న విమర్శన అసందర్భం. "నిజంగా మంగళహారతి తెస్తుంది కాబోలు పెంకిలంజ" అని రామప్పంతులు చెరువుగట్టుకు వెళ్ళేడంటే అంతకుముందు జరిగినఘటాలుజ్ఞాపకం తెచ్చుకుంటే ఈ అసందర్భపు విమర్శన కవకాశంఉండదు.

మొదటిసారి రామప్పంతులు వచ్చేసరికి ఇంట్లో ఇంకా దాసరివేషం వేయని శిష్యుడున్నాడు. వెనకగదిలో పోలిసెట్టి వగైరాలున్నారు. ఏదైనా ఎత్తుమెత్తి వారిని పెరటింటోవను పంపించి శిష్యుడికి దాసరివేషంవేసి పంపిన తరువాత తనపని చూసుకోవాలి. ఈలోగా లుబ్ధావధాన్లు మీనాక్షిని రామప్పంతులునీ చూడడం కాళ్లమీదకొట్టి యిద్దరినీ ఇంటినుండి తోలివేయడం జరుగుతుంది. ఆస్థితిలోవచ్చినవారిని మధురవాణి ఇంట్లో ఎలా ప్రవేశ పెడుతుంది ? అంతేగాని ఆనాటితో రామప్పంతులు ప్రాపకం వదులుకుందని ఎక్కడుంది ? రామప్పంతులు చెరువుగట్టు దగ్గర అగ్నిహోత్రావధాన్లుతో మాట్లాడుతూ ఉంటే దాసరివేషంలో శిష్యుడు ప్రవేశించడం జరుగుతుంది. అక్కడ రామప్పంతులుకీ శిష్యుడికీ జరిగిన సంభాషణ యిది:

శిష్యుడు— మిమ్మల్ని తీసుకురమ్మంది

రాము— చచ్చానే—వొస్తుందా యేవిఁటి ?

శిష్యుడు— కంటెపోతేపోయింది, రమ్మంది

రాము— బలికాను

....

శిష్యుడు— చిట్టిపులిపిల్లని తండ్రొచ్చి వండకి తీసుకుపోయినాడట

ఇందు "చిట్టపులిపిల్ల" మీనాక్షి. ఈ సంభాషణ చదివినవారికి, రామప్పంతులుకీ మధురవాణికీ రాజీ కుదిరిందని స్పష్టమవుతుంది. దావాలు కల్పించి నాల్గు డబ్బులు

రాబట్టుకోవడమే వృత్తిగా ఉన్న రామప్పంతులు విశాఖ పట్నం చేరుకోవడంలో గాని ఏనిమిషమైనా ఏమర్లితే మధురవాణి యెవణ్ణి చేరుస్తుందో అన్న అనుమానంతో పీడింపబడుతూ ఉన్న అతను ఆమెను విశాఖపట్నం చేర్చడంలోగాని ఆశ్చర్యమేముంది ? శ్రీ శాస్త్రిగారి వాదన యేమిటంటే ఇవన్నీ అరటిపండు విప్పినట్లు కవి చెప్పాలని ! మనఊహకు ఏమీ విడిచిపెట్టకూడదని ! ఈ వాదన ఎంత సమంజసంగా వుందో పాఠకులూహిస్తారని నమ్ముతాను.

ఇంతకూ అలాంటి చిన్నవిషయాలలో కూడా కవి జాగ్రతతీసుకున్నాడు. "ఆ అయ్యవారిని తోడిచ్చి వారిని పంపించేయండి. ఎకాయెకిని మనంవెళ్లిపోయి లుబ్ధావధాన్లు కన్నా ముందుముక్క తగిలించెయ్యాలి" — అంటాడు రామప్పంతులు. ఆతర్వాత తెలుస్తుంది, గిరీశం బుచ్చమ్మను లేవదీసుకుపోయాడని. ఇదేదో అంతు చూసినదాకా ఇంటి మొహం చూడనంటాడు అగ్నిహోత్రావధాన్లు. ఇంకా బళ్లు పూయించివారిని బళ్లల్లో ఎక్కించి సాగనంపడం కూడా కవి చూపడం అవసరమా ?

ఇలా "కన్యాశుల్కం" ఇతివృత్తం, సన్నివేశాలుగురించి యెంతవ్రాసినా వ్రాయవచ్చు. శ్రీ కేతవరపు వెంకట రామకోటిశాస్త్రిగారివంటి విమర్శకులకు యీ పైవిషయాలు చాలునని నానమ్మకం.

పాత్రపోషణ

గిరీశం

పాత్రపోషణా విమర్శనలో మనం తీసుకొనే మొదటి పాత్ర గిరీశం:— కన్యాశుల్కానికి హీరో ఇతనని, చాలా మంది అనుకోవడం కలదు. సంస్కృత పాండిత్యం మినహా మరేమీ లేని ఛాందసులనుకుంటే ఆశ్చర్యంలేదు! గిరీశం వంటివారు ప్రతీదేశంలోనూ ప్రతీకాలంలోనూ ఉంటారు —ఉన్నారు! ఆనాటి గిరీశం 'కన్యాశుల్కం' 'ఆంటినాచ్' 'విడోమారేజీ' అనే నూతనంగా వచ్చిన సంఘసంస్కారణలను ఆధారం చేసుకొని తను ఎరిగున్నంతమట్టుకు అందరినీ మోసంచేయ పూనుకున్నాడు. కాంగ్రెసు, దేశసేవకై పాటుపడుతూఉంటే చీమ కుట్టినట్లైనా లేకుండా వారికి వ్యతిరేకంగాకూడా ప్రవర్తించినవారు యీనాడు కాంగ్రెసునాయకులై ఉన్నారంటే వారిలో కొందరు గిరీశంగార్లే. అలాగే ప్రతీ రాజకీయపార్టీలలోనూ మనకు గిరీశంగార్లు కనబడుతారు. దేశకాల పరిస్థితులనుబట్టి వారి మోసానికనుగుణ్యంగా ఆనాటి పరిస్థితులు ఉపయోగించుకోవచ్చును గాని, గిరీశంవంటి వ్యక్తులు మాత్రం యేనాడైనా, యేదేశములోనైనా ఉంటారని ఒప్పుకోకతప్పదు. "కన్యాశుల్కం" నాటకానికి గిరీశం ముఖ్యపాత్ర అనీ "డామిట్ కథ అడ్డంగా తిరిగింది" అని వెళ్ళిపోయాడనీ, ఉదాత్తమైన గుణం ఒకటీ లేదనీ, ఏ పరమప్రయోజనం

ఇతను సాధించాడో తనకు బోధపడుట లేదనీ శ్రీ శాస్త్రి గారి వాదన. వీరి రచననుబట్టి, తప్పులతడకలతో నిండి ఉన్న శ్రీ కొండపల్లివారి ప్రచురణ నాధారంగా తీసుకొని వ్రాసిన విమర్శనను బట్టీ వీరు చాలా పిన్న వయస్కులని తోస్తుంది. వీరు పిన్న వయస్కులే కాక వ్యావహారిక భాష పట్ల వీరికొక నిరసన భావమున్నదనుటకు వీరి విమర్శనే తార్కాణం. శ్రీశాస్త్రిగారు ధర్మవరం కృష్ణమాచార్యులు గారిగురించి వ్రాస్తూ గయోపాఖ్యానాన్ని పేర్కొన్నారు. వారి ఆంధ్రభాషా పరిచయం యెంతో నేనెరుగను. ఇందు నేను పొరబడితే వారు క్షమిస్తారని నానమ్మకం. నేను చిలకమర్తివారి గయోపాఖ్యానాన్నే యెరుగుదును గాని ధర్మవరంవారి గయోపా ఖ్యానాన్ని చూడలేదు.

గిరీశంపాత్రా విమర్శనలో పైముక్కలు కొంత అనవసరమేమోగాని శ్రీ కేతవరపు వెంకటరామకోటిశాస్త్రి గారి విమర్శనాదృష్టిని అర్థంచేసుకోడానికి ఉపచరిస్తాయి.

"కన్యాశుల్కం"లో ఏ భాగం తీసుకున్నా అది నిత్య వ్యవహారంలో ఈనాడూ కనిపిస్తుంది. గిరీశం వెంకటేశాన్ని ఓదార్చి వెళ్ళేటప్పటికి అతనిదగ్గర ఒక దమ్మిడీ లేదు— లోకాన్ని మోసపుచ్చేశక్తి ఒకటే అతనికి మిగిలింది! ఫొటోగ్రాఫుపంతులు బంట్రోతుకి ఒకచుట్ట ఇచ్చి తప్పించుకుంటాడు. వెంకటేశంతో నాదగ్గిర టోకేగాని, చిల్లర లేదని ఒక శేరు కాశీమిఠాయి తెచ్చి బండీ మార్కెట్టుదగ్గిర సిద్ధంగా ఉంచమనీ చెబుతాడు. అసలీనాటకం గిరీశంపాత్ర

తో ప్రారంభిస్తుంది. విజయనగరం కోట కెదురుగా ఉంది బొంకులదిబ్బ. అందు ప్రప్రథమంగా గిరీశం ప్రవేశిస్తాడు. గిరీశం ఆత్మగతంలో వాని సంగతంతా వెల్లడవుతుంది. అది అర్థంచేసుకోకపోతే గిరీశంపాత్రే బోధపడదు. శ్రీ శాస్త్రిగారు, 'గిరీశం' విధవావివాహం చేసుకోవడమో "నెపోలియన్ ఆఫ్ ఆంటినాచ్" అయిపోవడమో అవసరమని ఊహిస్తే అంతకన్నా ఛాందసం మరిలేదు. గిరీశం నిజంగా సంఘసంస్కర్త కాడు ; 'ఆంటినాచ్' కాడు. ఏనాటికి తనకేది లాభిస్తుందో అది చూచుకోవడమే అతని ప్రకృతి. గిరీశంపాత్ర మీరెక్కడ చూడండి ఎక్కడ చదవండి అతను తన గప్పాలుకొట్టుకోవడం ఇతరులను మోసగించడం తప్ప మరొకటి కనబడదు. అలాంటివాని చేత ఏ విధవావివాహమో, ఏ మంచికార్యమో అప్పారావు గారు చేయించిఉంటే, ఆ గ్రంథాన్ని ఎన్నాళ్ళ క్రితమో మూలపడేసిఉందుము. ఒకవేళ శాస్త్రిగారు అతనిని గ్రంథకర్త చంపివేయకూడదా అంటారేమో ! "డామిట్ కథ అడ్డంగా తిరిగింది" అన్న గిరీశంమాటలు తలుచుకుంటే అతని పతనం యెవరికైనా అర్థమౌతుంది. ఈ అత్యద్భుత పాత్రని అంత చక్కగా పోషించిన మహాకవి కల్పనా చాతుర్యం అద్వితీయం.

గిరీశాన్ని ప్రవేశపెట్టిన దగ్గరనుండీ అంతం వరకూ కాలోచిత వ్యవస్థలనుబట్టి ఇతరులను మోసపుచ్చేవ్యక్తిగానే పాత్రను నడిపించారు గురుజాడవారు. అగ్నిహోత్రావ

ధానిని మరోవిధంగా లొంగతీసుకోలేక అతని మాటలకు మేలు భళాభళీ అన్నాడు. ఈవిషయమై వెంకటేశం అడుగుతే opinions అప్పుడప్పుడు మార్చుకుంటేనే గాని Politician కానేరడన్నాడు—గిరీశం. సౌజన్యారావు పంతులువంటివాడు మోసపోయాడంటే గిరీశంపాత్రను కవి యేదృష్టితో సృష్టించాడో అర్థమవుతుంది.

సంస్కృతపండితుడూ విదూషకుడూ అయిన కరటక శాస్త్రి గిరీశం సంగతి కొంత పోల్చుకున్నాడు. హైదరాబాదు నవాబుగారు వెయ్యి సిక్కా-రూపాయిల జీతంపైన ఉద్యోగం ఇస్తానని ఫర్మానా పంపేరన్నప్పుడు మధురవాణి కూడా వీని కోతలు పసికట్టింది. ఆ సీనులో మధురవాణి పాత్రను గురించి వ్రాసేటప్పుడు చర్చించవచ్చు.

కాని గిరీశంపాత్ర గురించే ఆలోచిస్తే తాత్కాలికంగా విజయనగరంలో ఉండే ఈతిబాధలు తప్పించుకోడానికి వెంకటేశంతో వారి వూరుచేరుకొని తలవనితలంపుగా తారసిల్లిన బుచ్చమ్మమీద కన్నువేసి పరమకోపిష్టి అయిన అగ్నిహోత్రావధానుల్ని వలలో వేసుకొని బుచ్చమ్మను లేవదీసుకోపోవడానికి కారణభూతుడయినాడు. ఇందులో కూడా వితంతువివాహం మంచిదని గిరీశంచేత నిరూపించే ఉద్దేశం, కవికి లేదు. బుచ్చమ్మవల్ల తనకేవో ఐహిక ఆర్థిక సుఖాలు కలుగుతాయన్న ఆశతో ఆమెను మోసపుచ్చడమే గిరీశం ప్రకృతిగా ఆపాత్రను సృష్టించాడు. ఎప్పుడైతే అగ్నిహోత్రావధాన్లు చర్యలను బట్టి తనకు

ఆర్థిక సంపద చేకూరదని ఆలోచించాడో, ఆనాటినుంచీ సౌజన్యారావు పంతులుని వలలో వేసుకోని లుబ్ధావధాను లుచేత దత్తత చేయించుకుందామని ప్రయత్నంచేస్తాడు.

ఇలాంటి గిరీశంలు మనందరిలో ప్రతిరోజూ తిరుగు తూనే ఉంటారు. వారిమీద ఇతమిద్ధమని నేరారోపణచేసి శిక్షించడానికి అవకాశం లేకపోవచ్చు. అలాంటివారిని Edgar Wallace వ్రాసిన Four Justmen వంటి వారు శిక్షించవచ్చునేమోగాని మామూలు కోర్టులలో శిక్షించడంకష్టం.

గిరీశం లుబ్ధావధాన్లుపేర వ్రాసిన ఉత్తరంకూడా రెం డుకారణాలతో వ్రాసినట్లు కనిపిస్తుంది. ఎవడూ ఎప్పుడూ సంపూర్ణంగా చెడ్డవాడుండడు. వెంకమ్మను రక్షించడానికి నూతిలోకిగెంతిన గిరీశం, సుబ్బిని రక్షించడానికి ఈజాబు బనాయించడంలో ఆశ్చర్యంలేదు. దానికి మరొక గరిష్ట కారణమేమిటంటే, బుచ్చమ్మ తన చెల్లలైన సుబ్బికి ఈ పెళ్లి తప్పించడం నియమంగా పెట్టింది. మొదటిప్రయత్నం సవ్యంగా చేశాడు. కరటకశాస్త్రి ఆడిన నాటకానికి గిరీశం జాబు నాందిగా పరిణమించింది. అది ఫలించినట్లు తెలి యక, తనతో లేచిపోవడమొక్కటే 'సుబ్బి' పెళ్ళి తప్పిం చడానికి మార్గమని బుచ్చమ్మను మోసగించి లేవతీసు కొని పోతాడు. ఇలాగే నడిచింది గిరీశంపాత్ర ఆదినుంచీ అంతంవరకూ !

శ్రీశాస్త్రిగారు కన్యాశుల్కంలో హాస్యమల్లా ఇంగ్లీషు

పదాలు వాడుటవల్లనే వచ్చిందనీ, ఏరసమూ లేని ఆ నాటకంలో ఇంగ్లీషుపదాలే వాడకపోతే హాస్యరసంకూడా ఉండకపోయియుండునని సూచించారు. కన్యాశుల్క నాటకంలో ఇగ్లీషుపదాలు విరివిగావాడినపాత్ర గిరీశం ఒక్కడే. మహాకవిగారు 1897వ సంవత్సరంలో ప్రచురించిన కన్యాశుల్కాన్ని చాలా ఎక్కువగాపెంచి 1909వ సంవత్సరంలో ప్రచురించేటప్పటికి ఉన్న మనదేశ వాతావరణం తెలుసుకొన ప్రయత్నించిన వారికెవరికైనా ఈ ఇంగ్లీషు పదాలు ఆపాటి ఈపాటి ఇంగ్లీషువచ్చినవాడు యెంతవిరివిగా వాడే వాడో తెలుస్తుంది. ఈనాడుకూడా వాడుతూనే ఉన్నారు.

ఆరోజులలో బెంగాలు విభజనరీత్యా వచ్చిన స్వదేశోద్యమం ఆంగ్లభాషా బహిష్కరణం శ్రీ బిపిన్‌చంద్రపాలుగారు ఊరూ వాడా చాటినా, ఒక్క బెంగాలులో తప్ప ఈనాటికీ మెడ్రాసులో రిక్షావాళ్లుకూడా ఇంగ్లీషు మాట్లాడుతూనే ఉంటారు. అలాంటిది మోసకారిగా గిరీశం పాత్రను సృష్టించి అతనిచే ఇంగ్లీషు మాట్లాడించడంలో ఆశ్చర్యం యేమిటో అవగాహన కావడంలేదు.

ఇలా ఇంగ్లీషుని జోడించి తనేదో చదువుకున్న వాడినని మోసంచేయడమే గిరీశం ప్రకృతి. ఆ పాత్రను కవి ఎంత చక్కగా పోషించాడో రూపించాలంటే ఒక గ్రంథం తయారవుతుంది. అందువల్ల గిరీశంపాత్ర విషయమై విమర్శన ఇంతటితో ముగిస్తున్నాను.

మధురవాణి

అప్పారావుగారి పాత్రసృష్టిలో ఇంత చక్కని పాత్ర మరొకటిలేదు. మధురవాణి పాత్రను చక్కగా నిర్వహించి ఆ పాత్రపోషణకు తోడ్పడిన అత్యుత్తమ నటులు శ్రీ స్థానంవారు, మధురవాణి ఒక అద్భుతమైన సృష్టి అని నాతో ఏకీభవిస్తారని నమ్ముతాను. ప్రథమప్రచురణ నాటకాన్ని విపులీకృతం చేస్తూఉంటే మధురవాణి పాత్రమీద తనకభిమానం కలిగిందనీ ఆ పాత్రను సంపూర్ణంగా మార్చివేశాననీ శ్రీ అప్పారావుగారే తెలియజేసినట్లు శ్రీ అవసరాల సూర్యారావుగారు ప్రచురించిన లేఖలలో కనబడుతుంది.

మధురవాణివి వెకిలిచేష్టలనీ రామచంద్రపురం అగ్రహారంలో పేకాటసీను, కొండుభొట్లుని ముద్దుపెట్టుకోవడం అప్రస్తుతములనీ, శ్రీ శాస్త్రిగారు వ్రాశారు. ఇది చాలా పొరబాటు. "రామప్పంతులు కథ పైకి పటారం, లోపల లొటారం" అని అప్పటికప్పుడే మధురవాణి పసికట్టింది. మరో కొమ్మను పట్టుకోవాలని అనుకుంటుంది. అందుకు ఆ వూరివారి సహాయం అవసరం. అంతేకాక రామప్పంతులే అంటాడు, "చెయిముట్టు సరసాలంటేమాత్రం నాకు కరచరణాలు ఆడవు", అని. హెడ్డు విషయమై కూడా మధురవాణి యే వ్యామోహంలోనూ పడలేదు. ఆనే అంటుంది—"అతడు ఇచ్చేదీ చచ్చేదీ లేదుగాని, జట్టీ

లేవైనా వొస్తే ఓవొడ్డు కాస్తాడు" అని. కొండుభొట్లుని ముద్దు పెట్టుకోవడం వానిని ఆకట్టుకోవడం కూడా ఆ పరిస్థితులలో అవసరమే. అలా చేయకపోతే కొండు భొట్లుకి తనమీద నమ్మకం కుదురదు. తనకు భృత్యుడై ఉండడు. తరువాత కొండుభొట్లు మాటలలో వాడెంత లొంగిపోయాడో తెలుస్తుంది. నిజానిజాలు రామప్పంతు లికి ఆచోకీ తెలియకుండా ఉండాలంటే కొండుభొట్లులాంటి వారిని చేతిలోనుంచుకోవడం చాలా అవసరం. కరటక శాస్త్రితో చెబుతూ "గులాం!" అని హెడ్డుని అంటుంది. అంతలోనే ఉంచింది హెడ్డుని. ఈసంగతి తక్కిన ఘట్టా లలోకూడా వ్యక్తమౌతుంది. "హెడ్డుని నౌకరులాగే తిప్పుకున్నానుగాని అంతకన్నా అధికంలేదే" అని మధుర వాణే కరటకశాస్త్రితో అంటుంది. "కాపుమనిషినై పుట్టి మొగుడిపొలంలో వంగమొక్కలకూ, మిరపమొక్కలకూ దోహదంచేస్తే, యావజ్జీవం కాపాడే తనవాళ్లన్నవాళ్లుం దురేమో" అని మధురవాణిచేతే అనిపించాడు మహాకవి. కాని, వ్యావహారికభాషలో సృష్టించబడిన ఇతివృత్తం గాని, సన్నివేశాలుగాని, పాత్రపోషణగాని శ్రీ శాస్త్రి గారికి రుచించినట్లు కనబడవు.

సుబ్బిశెట్టితో హాస్యాలాడి ఫకీరునిచేసి, భవానీ శంక రాన్ని రూపుమాపి, అతనిద్వారా బిల్వమంగళుని రప్పించు కొని, రాధ మృత్యువునకొకవిధంగా కారణభూతురాలైన చింతామణి గ్రాంథిక భాషలో చిత్రింపబడి శ్రీకృష్ణ

దర్శనభాగ్యం పొందడంవల్ల శ్రీ శాస్త్రిగారికి ఆ నాటకం ఇతివృత్తంలోనూ సన్నివేశాలలోనూ సార్వకాలికత సార్వజనీనత కన్పించవచ్చు. నేనాపాత్రను నిరసించడంలేదు. ఏ వ్యక్తికైనా ఒక చిన్నవిషయంలో పరివర్తన రావచ్చు. చింతామణికి బిల్వమంగళునిపైనున్న ప్రేమ ఈ పరివర్తనకు కారణం కావచ్చు. అది సాధారణ పాత్రకాదు. కాని మధురవాణి సహజమైన సహృదయమైన పాత్ర! ఆమె మన మనస్సును చూరగొంటుంది. సహృదయుడైన సౌజన్యారావుపంతులు మధురవాణికి శ్రీకృష్ణదర్శన మిప్పించలేకపోయినా భగవద్గీతను బహూకరించాడు. న్యాయమైన విమర్శనాదృష్టితో చూస్తే శరత్ బాబు సృష్టించిన దేవదాసులోని వేశ్యను కొంతవరకు మధురవాణితో సరిపోల్చవచ్చునేమో! అదైనా కొంతవరకే! ఈపాత్రౌచిత్యం గాని, పోషణగాని అందులోకూడా కనబడవు.

మధురవాణి పాత్ర నర్థంచేసుకోవడానికి బొంకుల దిబ్బమీద గిరీశం మాట్లాడిన మాటలు జ్ఞాపకం తెచ్చుకోవాలి. "నేనుయేమో ఉద్యోగాలూ ఊళ్లూ యేలి తనతో వైభవం వెలిగిస్తాననే నమ్మకంతోవుంది, పూర్ క్రీచర్!" —అంటాడు గిరీశం. కాని అందులోకూడా గిరీశం పొరబడ్డాడు. మధురవాణి గిరీశాన్ని, అతని బడాయిలనీ ఆ చోకీ కట్టింది. "కన్యాశుల్కం" రెండవ ప్రచురణ 42వ పేజీలో డిప్యూటీకలక్టరుగారి అల్లరి కొంచం మరుపొచ్చిందాకా పైనుందామని ఈవూరొచ్చానని మధురవాణి కరటక

శాస్త్రితో అంటుంది. తలవని తలంపుగా రామప్పంతులు దొరకడంవల్ల రామచంద్రపురం అగ్రహారం చేరుకుంది.

మధురవాణి ఇంట్లో (విజయనగరంలో) రామప్పంతులు, గిరీశం, పూటకూళ్లమ్మ సీను హాస్యరస ప్రాధాన్యంగానే సృష్టించలేదు, కవి. ఒకొక్క వ్యక్తినీ స్పష్టంగా మహాకవి మొదట్లోనే సూచించాడు. ఇందు పూటకూళ్లమ్మను మనం మరిచిపోవచ్చు. రామప్పంతులిని ముట్టుకోనివ్వకపోవడం, సొమ్ము విసరివేయడంలో అతన్ని మధురవాణి సంపూర్ణంగా బానిసగా చేసుకుంది. ఆపైని గిరీశంవస్తే అతన్నికూడా దూరంగా ఉంచడంలో రామప్పంతులు విశ్వాసం ద్విగుణీకృతమయింది. ఆ సీనులోనే రామప్పంతులు తల నిమిరి ముద్దుపెట్టుకోవడం కూడా జరుగుతుంది. విజయనగరం పరిస్థితులు రామప్పంతులికి తెలియవు. తనకొడుకు మధురవాణి ఇల్లుపట్టేడని యేదయినా కారణం దొరుకుతేచాలు మధురవాణిమీాద, ఆమె ఇంటికి వెళ్ళినవారిమీాద కసితీర్చుకోడానికి డిప్యూటీ కలక్టరు చూస్తున్నాడు. ఈభావం మధురవాణి మాటల్లోనూ కరటకశాస్త్రి మాటలలోనూ వ్యక్తమాతుంది. అందాకా ముట్టుకోనివ్వని మధురవాణి రామప్పంతులు తలనిమిరి ముద్దుపెట్టుకోగానే పోలీసులను మరచి అతను భృత్యుడై పోతాడని మధురవాణికి తెలుసు. అలాగే అయ్యాడు కూడా ! ఇంతకూ రామప్పంతులు ధైర్యం ఎంతుందో ఈ రంగంలో తెలుస్తుంది. ఇదంతా ఒక నిముషంలో జరిగి

పోతుంది. మేమీ నాటకం వేసినప్పుడుకూడా అలాగే షేముక్కా విడిచిపెట్టకపోయినా నిమిషాలమీద నడిచిందీఘట్టం. దీన్ని పొడిగించాలన్న కుతూహలం ఉన్న నటకులు తప్ప ఈసీను Tempoను మరెవ్వరూ పాడు చెయ్యలేరు. ఈ సీను ఎంత త్వరితంగా నడిపిస్తే అంత బాగుంటుంది. అందులో ఏ అవినీతీ కనబడదు. ఇంతకూ ఈఘట్టం చదువుతూ శ్రీశాస్త్రిగారు ఎంత మురిసిపోయియుంటారో! లేకపోతే మంచంకిందనుంచి వస్తూ "షడేల్మంటే పస్తాయించిచూస్తున్నా"నని పూటకూళ్లమ్మ అనేలోపున మధురవాణి రామప్పంతులిని సముదాయించడం జరిగిపోయిందే! కౌగిలింతలు, ముద్దులు, మురిపెములూ యెలాజరిగినవో నాకర్థమవడం లేదు. ఈనాడు సినీమాలలో అనేక వేషాలు వేస్తూయున్న శ్రీ దేవరకొండ రామమూర్తిగారు మా ప్రాంతాలలో ఈనాటకంలో లుబ్ధావధాన్లు వేషాన్ని ఘోటగాభ్రపంతులు బంట్రోతు వేషాన్నీ పూటకూళ్లమ్మ వేషాన్నీకూడా వేశేవారు. ఆయనకు పెద్ద మీసాలుండేవి. అవి తీయించుకోవడం ఇష్టంలేక మల్లుపంచ కట్టుకొని మునుగువేసుకొని మూతికొక చెంగు అడ్డంపెట్టుకొని ఒక్కనిమిషంలో పాత్రౌచిత్యం చెడకుండా పూటకూళ్లమ్మ పాత్రను నిర్వహించేవారు. ఆ నిమిషాల్లో కౌగిళ్లకు ముద్దులకు మురిపెములకు ఎక్కడవకాశం ఉందో శ్రీ శాస్త్రిగారికి ఈ ఊహాలన్నీ ఎలా పుట్టుకొచ్చాయో తెలియదు!

మధురవాణిపాత్రను ఆదినుంచి అంతంవరకూ ఒకే రీతిని నడపించాడు మహాకవి. ఆమె వేశ్య—దేవతాస్త్రీ కాదు. దైవత్వం పొందలేదు. స్వలాభం లేకపోలేదు గాని జాలి గుండె—అతీతమైన తెలివి తేటలు! కరటకశాస్త్రికి మేలశా లేకుండా తోడ్పడుతుంది. ఆఖరుకు కంటెనుకూడ అప్పచెబుతుంది. అవకాశం ఉన్నంతవరకు మంచిపనులు చేయుటకే ఉత్సహిస్తుంది.

సౌజన్యారావు మంచిని కరటకశాస్త్రి వల్ల విని, అతనిని చూడాలని కుతూహలపడి, ఆ తరువాత అతని నిగ్రహాశక్తిని పరీక్షచేయ ప్రయత్నించిందే గాని అతనిని పాడుచేయ దలచుకోలేదు. ఇంతకూ ఆమె ముఖ్యోద్దేశం లుబ్ధావధానుల్ని రక్షించడమే. సౌజన్యారావువంటి మంచి వారిలోకూడా లోలత్వానికి అవకాశం ఉంటుందని సూచించాడు కవి "అట్టేసేపు నువ్వు నాయెదుటగాని నిల్చి ఉంటే నువ్వు యేతగువుతీరిస్తే ఆతగువుకు ఒప్పుదల అవుతానేమో అని భయంవేస్తూంది"; "ముద్దుచేదనికాదు, వ్రతభంగం కదా అని దిగులుకల్గుతోంది" అన్న సౌజన్యారావు వ్రతభంగానికి అడ్డుపడ్డది మధురవాణి! ఈ అందమైన ఘట్టాన్ని శ్రీ శాస్త్రిగారెలా విమర్శించారో చూడండి: "చిట్టచివరకు సౌజన్యారావు ముద్దుపెట్టుకొనుటకు రాగా మహాపతివ్రతవలె 'చెడనివారిని చెడగొట్టవద్దని మాతల్లి చెప్పింది' అని వకీలునకు మాత్రమూ సౌఖ్యం కలుగజేసిందికాదు. (భారతి 71వ పుట) ఏమిటాసౌఖ్యం?

శ్రీ శాస్త్రిగారి మనోదృష్టిలో ఉండవచ్చునేమో నేనెరుగను గాని పాత్రపోషణ విమర్శనలో ఇలా వ్రాయడం ధర్మమేనా ?

మధురవాణి గురించి యెంతవ్రాసినా ఇంకా వ్రాయాలనే ఉంటుంది. రామచంద్రపురంలో మధురవాణి, రామప్పంతులు, లుబ్ధావధాన్లు ఉన్న రంగం వెకిలిగా ఉందని శ్రీశాస్త్రిగారు వ్రాశారు. శ్రీ కేతవరపు వేంకటరామకోటశాస్త్రిగారి విమర్శనను ఖండించే ఉద్దేశంతో నేనిది వ్రాస్తే ఆయనవ్రాసిన ప్రతీవాక్యం ఖండించవలసివస్తుంది. ఏ నాటకాన్నైనా సరిగ్గా అర్థంచేసుకోక తప్పులెంచుటే పరమావధిగా యోచించే ఛాందసుల విమర్శనలకు నేను ఈనాడు జవాబు వ్రాయనవసరంలేదు. గాని అలాంటి ఊహలు కలిగినవారికి, శ్రీ శాస్త్రిగారి విమర్శనను చదివి మోసపోయేవారికి, ఈ నాటకాన్ని ప్రదర్శించేవారికి, ఈ నాటకాన్ని సినీమా తీయాలనుకున్నవారికి ఉపచరిస్తుందనే ఉద్దేశంతో ఇది వ్రాస్తున్నాను. రామప్పంతులు, లుబ్ధావధాన్లు, మధురవాణి వచ్చిన సీను చతుర్థాంకంలో వస్తుంది. అంతకుపూర్వమే మధురవాణి కరటకశాస్త్రికి మాటయిచ్చింది. తను బయటపడకుండా రామప్పంతులికి గాని లుబ్ధావధాన్లుకిగాని తెలియకుండా అగ్నిహోత్రావధాన్లు కూతురు సంబంధం తప్పించే దృక్పథమే మధురవాణిది. అందుకూ ఆ నాటకమంతా ఆడింది. అందులో వెకిలితనం యెక్కడుందో నాకు తెలియదు. ఇదంతా

రామప్పంతులు సమక్షంలో జరిగిందన్న మాట గుర్తించుకోవాలి. రామప్పంతులుకంటే శ్రీ శాస్త్రిగారికి ఎక్కువ కోపంవచ్చినట్లు కనబడుతుంది, కారణం బోధపడదు.

పాత్రను సహజంగా సృష్టించి ఆ పాత్రమీాద మన కభిమానం కలుగజేయుటయే కవి చమత్కృతి. ఆ దృష్టితో నే మధురవాణి సృష్టింపబడింది. రెండవ ప్రచురణనాటకం దృశ్యనాటకం అయినా కాకపోయినా అదో మహాకావ్యమైపోయింది. అందులో యేభాగాలు మనం ప్రదర్శించినా అవి సంపూర్ణానందాన్నిస్తాయి. అందులో ఆ పాత్రలు నిత్యం మనలో మెలుగుతూ ఉన్నట్లే కనిపిస్తాయి. William Hazlitt వ్రాసినట్లు ఈ నాటకంలో 'It' 'అది' ఉంది. అదీ ఈనాటకంలో ఉన్న విశిష్టత. ఆ రీత్యా మధురవాణి పాత్ర చాలా అద్భుతంగా సృష్టించబడింది. దాని నర్థంచేసుకోకుండా ఆ పాత్రను వేయదలచుకున్నా, మధురవాణిని ఒక వెకిలిమనిషిగా నిరూపించినా, ఆ పాత్రకే కాకుండా నాటకానికి, మహాకవిగారికీ కూడా ద్రోహం చేసినవాళ్ళమవుతాం.

అగ్నిహోత్రావధాన్లు

అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు కూడా లుబ్ధులే. కాని వీరిద్దరి పాత్రలలోనూ వ్యత్యాసం ఉంది. అగ్నిహోత్రావధాని లుబ్ధుడే కాక, కోపిష్టి, పరద్రవ్యాశాపరుడూను. కోర్టులు, దావాలంటే పడిచస్తాడు. గిరీశంవల్ల ఇంగ్లీషు కాగితాలన్నీ తర్జుమా చేయించవచ్చునని అతనికి ఇంట్లో స్థానం ఇస్తాడు. సుబ్బి పెళ్లి తప్పిపోయిందన్న విచారంకంటే, కోపం యెక్కువయింది. లుబ్ధావధానిమీద డామేజీదావా తెద్దామా క్రిమినలు కేసు వేదామా ఏదిలాభకరం అన్నదే అతని ఆలోచన! ఈ పాత్రయు లుబ్ధావధాని పాత్రయు నాటకాంతంవరకూ ఉంటాయి. పసిపిల్లలను డబ్బుకమ్ముకొని వారి జీవితాలు నాశనంచేసే అగ్నిహోత్రుడూ, ఏ సంతానాపేక్షతోనో మరేకాంక్షతోనో పసిపిల్లలని వృద్ధాప్యంలోకూడా వివాహం చేసుకోడానికి సిద్ధపడ్డ లుబ్ధావధాన్లు ఈకథ ఇతివృత్తానికి ముఖ్యపాత్రలు.

ఈపాత్రలను ఎవరైనా సులువుగా అర్థంచేసుకోవచ్చు. కన్యాశుల్కాన్ని ఇలావిమర్శించిన శ్రీ శాస్త్రిగారికే అగ్నిహోత్రావధాని పాత్రను నిర్వహించి బహుమతి పొందారంటే ఈపాత్రగురించి ఇంతకన్నా యెక్కువ వ్రాయనవసరంలేదు.

శ్రీ శాస్త్రిగారికి పట్టుకున్న ధర్మసందేహం యేమిటంటే బుచ్చమ్మ జుట్టు అగ్నిహోత్రుడు ఎందుకు తీయించ

లేదు ? ఈ వాదన పర్యవసానం ఆలోచిద్దాం. చంటి బిడ్డను ముసలివానికి అమ్మడమే కాకుండా ఆ పరిస్థితులలో జుట్టుకూడా తీయిస్తే వెంకమ్మ యేమైయుండును ? ఎంత 82 పన్నాలు చదివినా, అగ్రహారీకుడైనా, అందు కొడ్డి గట్టుకుంటాడా ? అది చేయకపోతే పాత్రౌచిత్యం లోపించిందా ? మీనాక్షి జుట్టు తీయించాడా లుబ్ధావధాని ? తమ దురాచారాల్ని కప్పిపుచ్చుకొనడానికి బుర్ర గీయించుకున్న వారిని, యే శ్రాద్ధాలకో పనికివస్తారని బుర్ర గీయించుకున్న వారిని మన మెంతమందిని చూడడంలేదు ? బుచ్చమ్మ జుట్టు తీయించనంత మాత్రాన్ని అగ్నిహోత్రావధాని పాత్ర ఔచిత్యం ఎలాచెడిందో నాకు అవగాహన కావడంలేదు.

కవి అందరిలోనూ పరివర్తనం చూపిస్తే వాస్తవికతకు దూరమౌతుంది. అగ్నిహోత్రుడికి పరివర్తనం కలగలేదు. సౌజన్యారావు ఎంతో బోధపరుస్తే "వీడికి వెర్రికాబోలు" అని అగ్నిహోత్రావధాని వెళ్ళిపోతాడు. వీని ముఖ్య గుణాలు కోపిష్టితనం, ద్రవ్యాశా. ఇతరులు చెబుతే వినేది ఎన్నడూలేదు. టూకీగా ఇది— అగ్నిహోత్రావధాన్ల పాత్ర. పేరే సూచిస్తుంది పాత్రని.

—

లుబ్ధావధాన్లు

ఇతడు ఛాందసుడూ, లోభీ, అమాయకుడూను. రామప్పంతులు నియోగి. చుట్టతాగడం, ముండనుంచుకోవడం లేకపోతే పంతులాంగాని కేలోపం వస్తుందని అనుకొనేరోజులవి. పెళ్ళి తను లేనిదే అయిపోయినందుకు ఆగ్రహించి, "అంతా వినండయ్యా! యీ గుంటూరు శాస్త్రుల్లు వచ్చి దొంగ; లేకుంటే యీ తెలివిహీనుడు ఇచ్చిన రూపాయిలు సంధించుకొని పేరైనా చెప్పకుండా పరారీ అవుతాడా? నాతాలూకు సొమ్ముకూడా పట్టుక చపాయించాడు. వీడి వైఖరి చూడగా, ఏ రెండోపెళ్ళి పిల్లకో శూద్రపు పిల్లనో యీ తెలివిహీనుడికి అమ్మి, యెగేసినట్లు కనబడుతుంది"

లుబ్ధావధాన్లు అమాయకుడని చెప్పేను కదా. రామప్పంతులు మాట లతనిమనసులో మెరుగుతున్నాయి. ఆ రోజులు, ఆనాటి నమ్మకాలు, మనం గుర్తించుకోవాలి. Hamletతో అతని తండ్రివచ్చి మాట్లాడేడంటే వెర్రిగా చూసి ఆనందిస్తామే! లుబ్ధావధానికి Night-mare (ఒక పైశాచిక కల) వచ్చి దానికై భయపడితే, అందుకని కవిని నిందిస్తే మన విమర్శనాదృష్టి యెంత కుంచితమో తెలుస్తుంది.

ఆదినుంచి అంతంవరకూ అమాయకుడు లోభిగానే సృష్టించాడు లుబ్ధావధానిని. ఆఖరుకి సౌజన్యారావుని చేరి, అతని చీవాట్లుతిని రామనామతారక జపంచేసుకుంటాడు. కవి ఈవ్యక్తిలో పరివర్తన కలిగించి మీనాక్షికి తాను

చేసిన అన్యాయాన్ని గుర్తించేటట్లు చేశాడు, అదే ఈ ఇతివృత్తంలోని నీతి. ఆదృష్టితోనే కవి లుబ్ధావధాన్లుచేత "ఇంత డబ్బుండీన్నీ డబ్బుకి లోభపడి ఒక్కగానొక్క కూతుర్ని ముసలివాడి కమ్మాను. నాజీవానికి ఉసూరు మంటూ అది కానితిరుగుళ్లు తిరిగిందంటే దాని తప్పా? బుద్ధి తక్కువ వెధవని, ముసలితనంలో నాకు పెళ్ళేం?" అని అనిపించినట్లు కనబడుతుంది. లుబ్ధావధానిలో, కలిగినమార్పు ఈక్రిందిమాటలలో మనం తెలుసుకోగలం. "ఏమిచిత్రాలు: వెధవలకి మఠం కట్టారట, యెన్నడూ వినలేదు. అమ్మిని వెళ్ళి చూడమంటాను. దానికిష్టం కలిగిందా, దానికి కావలసిన డబ్బు యిస్తాను ఆ మఠంలో ఉంటుంది. లేకుంటే నాతోపాటు కాశీవాసం". విశాఖపట్నం చేరుకొని సౌజన్యారావుగారిని కలుసుకున్న తరువాత లుబ్ధావధాన్లు స్వగతంలోనూ ఇతరులతో మాట్లాడినమాటలలోనూ సౌజన్యారావుపంతులు అతనిలో ఎంత మార్పు తెచ్చేడో విశదమవుతుంది.

కన్యాశుల్క దురాచార నిర్మూలానికి విధవా వివాహానికి దోహదం ఇచ్చినట్లు నాటకంలో శ్రీ అప్పారావు గారు నిరూపించలేకపోయినారనీ, ఈ నాటకాన్ని చదివితే శ్రీ వీరేశలింగంపంతులుగారు, శ్రీఅప్పారావుగారు తమ ఉద్యమాల కనుకూలురా ప్రతికూలురా అన్న అనుమానం పడవచ్చుననీ సూచించారు శ్రీ శాస్త్రిగారు. వీరేశలింగంగారు వీరివంటి ఛాందసులు కారని చెబితే చాలు.

కరటకశాస్త్రి

శ్రీ కేతవరపు వెంకటరామకోటిశాస్త్రిగారి పదాన్నే వాడితే కథలో సూదిలో దారంవలె కరటకశాస్త్రి ఆఖరు వరకూ కనబడుతాడు. ఇతను సంస్కృత పండితుడూ, విదూషకుడూను. నాటకాలలో వేషంవేస్తాడు. ఆడపిల్లలు నాటకంలో వేషాలువెయ్యని రోజులు గనుక శిష్యుడిని కూడా నాటకాలలో తిప్పుతాడు.

వెంకమ్మని రక్షించడం, బుచ్చి పెళ్ళి తప్పించడం అతని దృక్పథం. అసలు కొంతవరకూ ఈ దురాచారంపట్ల అతనికి ఉన్న అయిష్టత, "బావా యీసంబంధం చేస్తే నీ కొంప కగ్గిపెట్టేస్తా" ననడంలో తెలుస్తుంది. వీటన్నిటితో పాటు ముఖ్యంగా తన విదూషకప్రజ్ఞ చూపించాలన్న కుతూహలంకూడా ఉందేమో ? శిష్యునికి తన కుమార్తె నిచ్చి పెళ్ళిచేస్తానని ప్రమాణంచేసి అతని కాడపిల్ల వేషం వేస్తాడు. రామచంద్రపురం అగ్రహారంలో రామప్పంతులుకి పలుకుబడి ఉందనీ, అతనిని మంచిచేసుకోవడం అవసరమనీ వారింటికి వస్తాడు. మధురవాణి మాత్రం పసికడుతుంది. తలవనితలంపుగా మధురవాణి సహాయం లభించింది. ద్రవ్యాశకూడా చూపిస్తాడు కాని, మధురవాణి తిరస్కరిస్తుంది. మేనాడ్లో సౌజన్యారావు పంతులుగారివద్ద పాతివ్రత్యం నటించడంకాదు — మొదటినుంచీ, కవి, మధురవాణి సహృదయాన్ని సూచిస్తూనేయున్నాడు.

V.R. NARLA
D.P.R.L.
Acc. No.

లుబ్ధావధానిమీద ఖూనీకేసు బనాయించారనగానే అతని నెలాగైనా తప్పించాలని మధురవాణిని కాళ్ళావేళ్ళా బ్రతిమాలి కంటెను తీసుకొని పంపిస్తాడు. ఈ ఘట్టంలోనే మధురవాణి మంచితనంకూడా మనకు బోధపడుతుంది. కరటకశాస్త్రిపాత్ర ఈనాటకంలో చాలా ముఖ్యమైనది. అతడు జన్మతహానైదీక్షైనా లౌక్యుడు. ప్రపంచజ్ఞానం ఉన్నవాడు. సమయోచిత ప్రవర్తన తెలుసుకున్నవాడూను ! డిప్యూటీకలక్టరువద్దకు "వెళ్లువెళ్లు వెళ్లువెళ్లు"అని ప్రోత్సహించాడంటే స్వలాభాపేక్షకోసమే. కాని మధురవాణి ఇక సీమకుక్కలనీ ఊరకుక్కలనీ కూడా చూడనంటుంది. మధురవాణి చీవాట్లకు లంకించుకుంటే, జరూరు పనిఉంది రేపువస్తానని తప్పించుకుంటాడు. స్వతఃసిద్ధంగా మంచివాడు. కాని విదూషకునికున్న లక్షణాలన్నీ ఉన్నాయి. ఛాందసుడుకాడు— కార్యవాది. ఇలా సృష్టించాడు కవి యీపాత్రని. శిష్యుడి పాత్రగురించి వేరే వ్రాయనవసరంలేదు. విదూషకునికి తగిన అల్లుడు— నేర్పరి అయిన శిష్యుడు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

రామప్పంతులు

ఇతను నియోగి—కరణం—కోర్టుపక్షిన్నీ ! దావాలు కల్పించడం ఇటూ అటూ నాల్గుడబ్బులు చేసుకోవడం వృత్తి. ప్రగల్భాలు పలకడం గిరీశంలాగే ఇతని రెండవ ప్రకృతి. ఇతను మధురవాణిని తీసుకొచ్చి తన పోషకం లో ఉంచుకోవడానికికూడా నిజంగా అసమర్థుడే. విజయ నగర పరిస్థితులలో మరోచోటుకి పోదామన్న ఉద్దేశం. మధురవాణికే లేకపోతే రామప్పంతులు వెంటవచ్చేదే కాదు.

పట్నం "విడిచి పల్లెటూరు చేరగానే, మీదృష్టిలో పలుచనైతినే"—అంటుంది కరటకశాస్త్రితో.

రామప్పంతులు తన పంతులాంగానికి వన్నె తెస్తుందనీ మధురవాణిని తెచ్చుకున్నాడు. కాని నిజంగా యేవిధం గానూ చావలేదు. భూములన్నీ అమ్ముడైపోయాయి, డబ్బూ దస్కంకూడా లేదు. అతనితో రామచంద్రపురం అగ్రహారం చేరడంవల్ల మధురవాణి అతనిద్వారా నాటక మాడించి తన చిరపరిచితులు కరటకశాస్త్రికి ఉపకారం చేయడం, సుబ్బిపెళ్ళి అనే అవినీతి కార్యాన్ని తప్పించ డానికి రామప్పంతులుని వినియోగించుకుంది. తనుచేసిన మంచి మరొకరికి చెడుపులేకుండా లుబ్ధావధాని వగైరాలం దరినీ కాపాడుతుంది. ఇంతా రామప్పంతులు కన్నుకప్పే ! అతనికి స్వలాభంలేని సహాయం అర్థం కాదు. ప్రతీ విష

యంలోనూ, తన కెంతకిడుతుందా అని ఆలోచించే రకం. రామప్పంతులుతో నిజం చెబితే, కరటకశాస్త్రి వద్ద డబ్బు పిండడమో లేక అతనినీ అతని శిష్యునీ జైలుకి పంపించే వరకూ ముప్పు తేవడమో తప్పదు. ఇదీ అతని ప్రకృతి. ఆపాత్రలో అంతకన్నా ఆశించడం ధర్మంకాదు. అలాంటి నిష్ప్రయోజన వ్యక్తులలో పరివర్తనకూడా దుర్లభం. ఆనాటి నియోగప్పంతుళ్ళలో ఉండే అవినీతిని రామప్పం తులుద్వారా సూచించడంవల్ల శ్రీ అప్పారావుగారు తన కల్పనా చాతుర్యాన్ని కనబర్చడమే కాకుండా, ఆ పాత్ర వల్ల వారినిష్పాక్షికదృష్టినికూడా ప్రకటించారు.

సౌజన్యారావు

ఈపాత్రద్వారా కవి తన మనోద్దేశాలను వ్యక్తపరి చేడు. అందుకే ఈపాత్రను ఆఖరు అంకాలలో కవి ప్రవే శపెట్టేడు. మనం సౌజన్యారావుని కలుసుకొనుటకు పూ ర్వమే, అతని మంచితనం లుబ్ధావధాన్లు ఆత్మగతంలో తెలుస్తుంది. ఇందులోనే లుబావధాన్లు మనః ప్రవృత్తిలోని మార్పుకూడా మనకు కనబడుతుంది. లుబ్ధావధాని బసకు వెళ్ళడంలో ,అసందర్భంగాని అశ్లీలంగాని ఎక్కడుందో నాకు తెలియదు. ఒక పార్టీయింటికికూడా వకీలు వెళ్ళ టకు లక్షకారణాలుంటాయి. నేనూ ఒక అడ్వకేటుని ! నేనూ అలావెళ్లిన పరిస్థితులు లేకపోలేదు. అంతమాత్రా న్న సౌజన్యారావుపాత్ర కుంచితంకాదు—కాబోదు.

సంకుచితం

మధురవాణిపాత్ర గురించి వ్రాస్తూ సౌజన్యారావున్న మాటలు నేను సూచించాను. శ్రీ అప్పారావుగారు ఒక దేవుణ్ణీ, ఒక రాక్షసుడినీ సృష్టించలేదు. మామూలుగా మనలో ఉన్న మనుష్యులను సృష్టించారు—ఆ సృష్టిలో సౌజన్యారావొక ఉత్తమపాత్ర. అతనిద్వారా నీతిబోధకం చేస్తుంది ఈ నాటకం.

ఇతరపాత్రలు

వెంకటేశం వెంకమ్మ హెడ్డు వగైరాపాత్రలు నాటక ఇతివృత్తానికి ముఖ్యమైనవిగావు. కాని ఆయా సన్నివేశా లనుమాత్ర ముపయోగపడుతవి. ఈపాత్రలగురించి వ్రాసి నపుడుకూడా శ్రీ శాస్త్రిగారు లోపమెంచడమే పనిగా పెట్టుకొని వ్రాసినట్లు కనబడుతోంది. వెంకటేశం, వెంకమ్మ పాత్రలు ప్రముఖపాత్రలనీ వారిని రామచంద్రపురం చెప్పు గట్టు సీను తరువాత చూపకపోవుటవల్ల రూపకం శిథిల బంధమైనదన్నీ అన్నారు. ఇది ఎంత సమంజసముగా ఉందో సహృదయులకే విడిచిపెడతాను.

తక్కినపాత్రల విషయమై అసలే వ్రాయనవసరము లేదు. బైరాగీ వగైరాల సీనులు ఆనాటి వాతావరణం, మూఢనమ్మకాలు, లంచగొండితనం వగైరాలు సూచి స్తాయి. ఆరోజులవి! ఈరోజులలో కూడా అలాంటివి అరుదుకాదు!

కన్యాశుల్కం నాటకమా, ప్రహసనమా, రూపకమా అన్న వాదనలలో నాకు నిమిత్తంలేదు. ఆ రోజులలో ముఖ్యంగా అలజడి కలుగజేసిన ఒక సాంఘిక ఇతివృత్తాన్ని తీసుకొని శిష్ట వ్యావహారికభాషలో ప్రప్రథమంగా ఒక గ్రంథాన్ని సృష్టించారు—మహాకవి. అందుకే అతనిని యుగకర్త అంటారు. ఈనాడు నవలారచయితలూ, కథకులూ, తదితరులూ విరివిగా వాడుతూఉండే వ్యావహారిక భాషకు, దారిచూపినవారు—మహాకవి అప్పారావుగారు.

ఈ మధ్య ప్రకటింపబడిన "వాణి"లో భాసుని రంగస్థల సాంప్రదాయం గురించి శ్రీ జి. వి. సుబ్బరామయ్యగారు, విజయవాడనుంచి మాట్లాడినది పడింది. అందు భాసుని శ్లాఘించారు. శ్రీ సుబ్బరామయ్యగారు సంస్కృతాంధ్ర పండితులు. ప్రాచీననాటక సాంప్రదాయం: రంగస్థలం మీాద యుద్ధం, మరణం ఇత్యాదివి చూపకూడదని. కాళిదాసువంటి మహాకవికూడా భరతుని సిద్ధాంతాలను అతిక్రమించడానికి వెరచేడు. భాసుడుమాత్రం రంగస్థలంమీాద నిర్భయంగా అవి చూపించాడు. అంతమాత్రాన భాసుని నిందించగలమా ? ఏ దృష్టితో శ్రీ శాస్త్రిగారు కన్యాశుల్కాన్ని ఇంతకటువుగా విమర్శించారో అవగాహన కావడంలేదు.

28-10-32వ తేదీని జరిగిన శ్రీ గురుజాడ అప్పారావుగారి స్మారకోత్సవ సభకు అధ్యక్షులుగా శ్రీ చింతా దీక్షితులుగారు ఇచ్చిన ఉపన్యాసములోని కొన్ని

వాక్యము లిచ్చట ప్రచురిస్తున్నాను :

"అప్పారాయకవిగారిని తలచుకొంటే రెండు విషయములు మనస్సునకు తట్టుతవి. వారు భాషలో తీసుకొని వచ్చిన మార్పు ఒకటి. సారస్వతములో వారు ప్రవేశ పెట్టిన మార్పు ఒకటి" ....

"మొట్టమొదట ఈ భాషలో గ్రంథరచనకు పూనుకొంట అప్పారావుగారే. నేటి యువకులు కొందరుకూడా జీవద్భాషలో కావ్యములు వ్రాసి సారస్వతసేవ చేస్తున్నారు"...................

"కన్యాశుల్కమువంటి నాటకములు తెలుగులో లేవు. వచననాటకములకు అప్పారావుగారే ఆదిభిక్ష పెట్టారు".

"ఈ కాలములో కవులు పలువురున్నారు. అప్పారావుగారు నైపుణ్యముతో వాడిన జీవద్భాషనూ, వారి శిల్పమునూ వీరు తెలుసుకొని వారివలెనే వీరునూ వ్రాయప్రయత్నిస్తే భాషకు చాలా లాభకరముగా ఉంటుంది".......

"అప్పారావుగారు రాజకీయవేత్త, పండితుడు, పరిశోధకుడు, సంఘసంస్కర్త, కవిగ్రామణి. నేటి పలువురు కవులను, వారి కావ్యములే కావ్యరచనకు పురికొల్పినవి. ఇట్టి మహనీయుని స్మరించుకొంటూన్న మనము ధన్యులము".

ఈవ్యాసము 1932 డిసెంబరునెల భారతిలో ప్రచురింపబడినది. ఈవ్యాసములోనే శ్రీ అప్పారావుగారు సంస్కృత-ఆంధ్ర-ఆంగ్ల భాషలలో పండితులనికూడా సూచించారు.

ఈ విధంగానే తెలుగుభాషకు శ్రీ అప్పారావుగారుచేసిన అపూర్వమైన సేవ, వారువాడిన జీవద్భాషలోని ఔన్నత్యమూ, వారు శిల్పములో చూపిన చాతుర్యమునూ చాలామంది పేర్కొనియున్నారు.

శ్రీ కేతవరపు వెంకటరామకోటిశాస్త్రిగారు వ్రాసినట్లు "మహాకవి", "యుగకర్త", "ఆంధ్ర సారస్వత సామ్రాట్" ఇత్యాది బిరుదములు శ్రీ అప్పారావుగారియందున్న విశేషాభిప్రాయమునుబట్టి ఇవ్వబడలేదు. వారి కాబిరుదముల నిచ్చినవారు, పండితులూ, కవులూను ; ఇచ్చిన సభలు కవిపండితసభలు ! అవి సార్థకములు—చిరస్మరణీయములు!

తెనుగు సారస్వతములో ఒక నూతన యుగాన్ని నెలకొల్పేరు అప్పారావుగారు. పాటలలో, నాటకములలో, ఖండ కావ్యములలో, చిన్నకథలలో, వ్యాసములలో వారి నవీన సాహిత్యదృష్టి, పరిశుద్ధమైన కండగల జీవభాషను వాడే నైపుణ్యము, పాత్రపోషణాదులును, శ్రీ చింతా దీక్షితులు గారనినట్లు 'అనితర సాధ్యములు'.

శ్రీ గురుజాడ అప్పారావు పంతులుగారిని మరచిపోతే మనం ఆధునిక ఆంధ్రవాఙ్మయానికే ద్రోహం చేస్తాము. వారి ఆత్మకు నా వేనవేలు నమస్కారములు.

ఓం శాంతిః

Printed by K. G. Rao at I. L. P. Press, Berhampur
and Published by M. Sitaramayya, Berhampur.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం పేరు	కర్త్యాకర్మ్యము
[illegible]	[illegible]
[illegible]	[illegible]
[illegible]	51
[illegible]	NO [illegible]
పత్రి సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	2
లేని పేజీలు	[illegible]
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	Vedavathi [illegible]
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good